క్లుప్తంగా

మహిళ ఉసురు తీసిన వాహనం

మద్దిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండు గంటల సమయంలో ఏడుగుండ్లపాడు వద్ద జాతీయర హదారిపై చోటు చేసుకుంది. ఐషర్ సర్వీస్ సెంటర్ సమీపంలో విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం మహిళను ఢీకొట్టడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందింది. స్థానికులు మద్దిపాడు పోలీసులకు తెలియ పరచగా ఎస్‌ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఒంగోలు మార్చురీకి తరలించారు.

కూలి తగ్గకుండా చూడండి


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ వెంకట స్వామి

చీమకుర్తి: ఉపాధి పనులను చేసే కూలీలకు సరాసరిన రోజూ వారి కూలి రూ.272 కు తగ్గకుండా చూడాలని ఏపీడీ వెంకటస్వామి ఉపాధి సిబ్బందికి తెలిపారు. బుధవారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి మండలంలో నిర్వహిస్తున్న పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ అడిగిన ప్రతి ఒక్కరికీ పనులను కల్పించాలని, కూలీల టార్గెట్‌కు తగ్గకుండా హాజరయ్యే విధంగా చూడాలని తెలిపారు. ఏపీఓ వాసంతి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం


చీమకుర్తి గ్రంథాలయంలో పిల్లలతో ఉపాధ్యాయులు

చీమకుర్తి: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే క్రమంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు చీమకుర్తి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. రిసోర్స్ పర్సన్లుగా ఉన్న ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు కథలు చెప్పటం, వారి చేత కథలను చెప్పించటం, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులను చైతన్యం చేయించటంలో ఎంతగానో దోహద పడుతోంది. లైబ్రేరియన్ కె. సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రతాప్ కుమార్, నరేంద్ర కుమార్ విద్యార్థుల మనస్సులకు నచ్చే కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు.

నీలం పాలెంలో తెగిన విద్యుత్ తీగలు


తెగిపడిన విద్యుత్ తీగలు

ఒంగోలు టౌన్: నగరంలోని నీలం పాలెంలో కరెంటు తీగలు ఊడిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పాత మార్కెట్ సెంటర్లోనీ నీలం పాలెం పోలేరమ్మ గుడి దగ్గర మంగళ వారం రాత్రి 9.45కు విద్యుత్ తీగలు తెగిపోయాయి. వెంటనే స్థానికులు ఇచ్చిన సహకారం మెరకు విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకొని మరమ్మతులు చేశారు. అయితే రెండు మూడు సార్లు మరమ్మతులు చేసినప్పటికీ తీగలు నిలబడలేదు. చేసేదేమీ లేక విద్యుత్ సిబ్బంది వెళ్ళిపోయారు. బుధవారం కూడా అదే పరిస్థితి కొనసాగింది. పగలు కూడా విద్యుత్ సరఫరా లేకపోగా రాత్రి 9 గంటల ప్రాంతంలో మళ్లీ తీగలు తేగాయి. ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు.

25న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చీమకుర్తి: సంతనూతలపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 25న మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ కె.రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బి.విజయ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన

- సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు


గుండ్లాపల్లిలో ప్రభుత్వాన్ని దీవించమని కోరుతున్న ఎమ్మెల్యే టీజేఆర్, నాయకులు

మద్దిపాడు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లాపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్ష పాలన ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు బలహీన వర్గాలకు పలు పథకాల ద్వారా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. రైతులకు ఆర్‌బీకేల ద్వారా సహాయపడుతూ పంట నష్టం కలిగితే అదే సీజన్‌లో వారికి పంట నష్ట పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటూ రైతులకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. ఆటో వాలాల దగ్గర నుంచి చిన్నపాటి చేతి వృత్తుల వారికి పదివేల రూపాయల చొప్పున ధన సహాయం అందిస్తూ వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సహాయపడుతున్నారని చెప్పారు. జగనన్న చేయూత పథకం ద్వారా 45 సంవత్సరాలు నిండిన మహిళలకు 18750 రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు 75 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్న సేవల్లో ఏపీ.. దేశానికే కాకుండా విదేశాల్లో కూడా రోల్ మోడల్‌గా నిలిచిందని తెలిపారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా పురోభివృద్ధి వైపు నడుపుతూ ఇన్ని మంచి పనులు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. దుష్ట చతుష్టయానికి సీఎం చేస్తున్న మంచి రుచించడం లేదని.. అందుకే చంద్రబాబు సూచనల మేరకు దత్తపుత్రుడు.. అన్ని పార్టీలు కలిసి జగన్‌ను ముఖ్యమంత్రి కాకుండా చేయాలని అలయన్స్ అంటూ చెబుతున్నాడని విమర్శించారు. దాని ప్రకారమే పచ్చపత్రికలు, పచ్చ మీడియాలు చిలువలు పలువలు చేస్తూ బాకా ఊదుతున్నాయని ఆగ్రహించారు. ప్రతి ఒక్కరి మనసులో జగన్ ఫోటో ఉందని, ఆది గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పష్టంగా తెలిసిపోయిందన్నారు. లోకేష్ పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకోకుండా ముఖ్యమంత్రి జగనన్నను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని.. సక్రమంగా మాట్లాడలేని వ్యక్తి లోకేష్ అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రస్తుత నాలుగు సంవత్సరాల పాలనలో జరిగిన అభివృద్ధిని తీసుకుని చర్చిద్దాం రండి అంటూ సవాల్ విసిరారు. ప్రభుత్వమంటే ప్రజలకు న్యాయం చేసే విధంగా ఉండాలి కానీ.. దోచుకో పంచుకో తినుకో అంటూ ఉండకూడదని ఆయన ధ్వజమెత్తారు. సుభిక్షమైన పరిపాలనకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, సీనియర్ నాయకులు గట్టినేని అయ్యన్న, మోరబోయిన సంజీవరావు, లింగారామ కృష్ణారెడ్డి, రాయపాటి రమేష్, గుడ్డపాతల రవి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, ఎంపీటీసీలు బొమ్మల ఏసుదాసు, పైనం ప్రభాకర్, కొమ్మూరి సుధాకర్, గ్రామ సర్పంచ్ కొప్పోలు ఆంజనేయులు, ఎంపీటీసీ పద్మకుమరి, గ్రామ నాయకుడు జవ్వాజి లక్ష్మీనారాయణ, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నీటి కోసం అమృత సరోవర్


రాజుపాలెంలో అమృత సరోవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుజాత (ఫైల్)

- వర్షపు నీటి నిల్వల కోసం చెరువుల తవ్వకాలు

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంతంలో నీరు నిల్వ చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నీటి గుంతలకు ప్రోత్సాహం ఇస్తోంది. అమృత సరోవర్ పేరుతో ఈ నిర్మాణాలు చేస్తోంది. రాజపాలెం, ఆలూరు గ్రామాలకు రెండు చెరువులను తవ్వేందుకు నిధులు మంజూరు చేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాజుపాలెం గ్రామానికి రూ.10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. చెరువు కోసం 1.50 సెంట్ల విస్తీర్ణం కేటాయించారు. ఇప్పటికే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆలూరు అమృత సరోవర్ చెరువుకు ఎకరా భూమిని కేటాయించడంతో పాటు రూ.6.90 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆలూరు చెరువును గురువారం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ప్రారంభిస్తారని ఆలూరు సర్పంచ్ పూనూరి మాధవి తెలిపారు.

ప్రజల కోసం..

అమృత సరోవర్ చెరువులు వలన జీవరాసులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఆలూరు, గాదె పాలెం గ్రామాల్లో వర్షం మీద ఆధారపడి జీవిస్తారు. ఈ నీరు జాగ్రత్త చేసుకుని ఏడాది పాటు ఉపయోగించుకుంటారు. చెరువుల తవ్వటం వలన వర్షపు నీరు నిల్వ ఉంటాయి. బయటకు వెళ్లకుండా, ఆవిరి కాకుండా ఉంటాయి. పశువులకు, జలచరాలకు అనుకూలంగా ఉంటుంది. భూగర్భ జలాలు అడుగంటకుండా కాపాడతాయి. రైతులకు పంటలకు నీరు నింపుకోవడానికి బాగా ఉపయోగించుకోవచ్చు. చెరువు చుట్టూ మొక్కలు నాటడం వలన నీరు ఆవికాకుండా రక్షిస్తాయి. పశువులకు, పక్షులకు, చేపలకు నీటి సమస్య లేకుండా దోహద పడతాయి. నీటి మట్టం కూడా పెరుగుతుంది. మిగతా గ్రామ పంచాయతీలకు కూడా చెరువులు ఏర్పాటు చేసి నీటి సమస్య అరికట్టాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన పీడీ

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట, రుద్రసముద్రం, ఇండ్లచెరువు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పీడీ శీనారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు పలు సూచనలు చేశారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకే పనులు చేయాలని, ఈ నెలలో ఎండ తీవ్రత ఎక్కువ ఉందన్నారు. రోజూ సరాసరి సగటు రూ.272 కూలి వచ్చేలా ప్రతి మనిషి పని చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు తప్పకుండా ప్రభుత్వం పని కల్పిస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేతనాలు ఏ వారానికి ఆ వారం అప్‌డేట్ చేసి చెల్లించే విధంగా చూడాలని ఉపాధి సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం గంగదేవిపల్లిలో అమృత సరోవర్ మంజూరైందని, దానికి సంబంధించిన స్థలాన్ని శీనారెడ్డి పరిశీలించారు. వర్షాకాలం వచ్చేలోపు అమృత సరోవర్‌ను పూర్తి చేసి నీటి శాతం పెంచాలని పీడీ శీనారెడ్డి ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఏపీఓ దేవయ్య, ఈసీలు ఉన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న పీడీ శీనారెడ్డి

దర్శి: ఫీల్డ్ అసిస్టెంట్‌లే మస్టర్‌లు వేయాలని ఏపీఓ కళ్యాణి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నడింపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు తమకు ఫీల్డ్ అసిస్టెంట్ బదులు మేట్‌లు వచ్చి ఫొటోలు తీసుకుని మస్టర్ వేస్తున్నారని మంగళవారం సాయంత్రం ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లే వచ్చి మస్టర్‌లు వేయాలని ఏపీఓ కళ్యాణితో మాట్లాడారు. ఇక నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌లే మస్టర్‌లు వేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి కూలీలు నిర్దేశించిన ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతాల్లో పనుల చేస్తున్నారని


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీవో

మేట్లు చెప్పన్నారని అలా చేయవద్దని వారికి తెలియజేశారు. ఈ విషయాన్ని వివాదం చేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నం చేశారు. సమస్య పరిష్కారమైనా కూలీలతో ధర్నాలు చేయించేందుకు విశ్వ ప్రయత్నం చేయడం గమనార్హం.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరంలో ఉపాధి హామీ కూలీ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్ము వెంకటయ్య (65) రోజూ ఉపాధి పనులకు వెళ్తుంటాడు. బుధవారం పని ప్రదేశంలో ఒక్కసారిగా గుండెనొప్పితో బాధపడతూ నేలకొరిగి మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పుల్లలచెరువు: ఉపాధి హామీ పథకంలో కొలతల ప్రకారం కూలి చెల్లిస్తారని ఏపీఓ ఎలీశా తెలిపారు. ఆయన బుధవారం పుల్లలచెరువు, గంగవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుతం కూలి రూ.272 చెల్లిస్తోందని, ప్రతి ఒక్కరూ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే మొత్తం కూలి పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. పనులు సకాలం చేయాలని సూచించారు. ఈయన వెంట టీఏ, క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై

బల్లికురవ: గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా స్థాయి టెన్నిల్‌బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించటం అభినందనీయమని, క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎస్సై వీ. వేమన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాతమల్లాయపాలెం గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఎస్సై ప్రారంభించి ఆటఆడి ఉత్తేజ పరిచారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 52 టీమ్‌లు ఎంట్రీలు సమర్పించినట్లు నిర్వహక కమిటి సభ్యుడు బండి నాగార్జున తెలిపారు. 20 రోజులపాటు జరిగే ఈ పోటీలకు మొదటి బహుమతిగా రూ. 20 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ.10 పది వేలను అందజేస్తున్నట్లు చెప్పారు.

రైతుకు అండగా వైఎస్సార్ యంత్రసేవ


యంత్ర పరికరాలు అందిస్తున్న బ్యాంక్ మేనేజర్, మండల ఏవో

- రూ.67 లక్షల యంత్ర పరికరాలు పంపిణీ

చీరాల: అన్నదాతలకు పీడీసీసీ బ్యాంకు సహకారంతో సబ్సిడీపై యంత్ర పరికరాలు అందించడం శుభ పరిణామమని మండల ఏవో సుమతి, పీడీసీసీ బ్యాంకు మేనేజర్ వాసుదేవ్‌సింగ్, బోయిన కేశవులు, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు చెందిన రైతులకు పీడీసీసీ బ్యాంకు సహకారంతో 2022–23 సంవత్సరానికి రైతుభరోసా కేంద్రాల్లోని రైతులకు యంత్ర పరికరాలను అందించారు. రైతులకు పెద్ద ట్రాక్టర్లు 2, మినీ ట్రాక్టర్లు 1, రోటవేటర్లు 8, డిస్క్ పెడ్లర్లు 2, తైవాన్ స్ప్రేయర్లు 10, మినీ రోటవేటర్లు 1, కల్టివేటర్లు 4, బ్లేడర్లు 3, ట్రక్ 1, ఇతర యంత్ర పరికరాలు 6 మొత్తం రూ.67.2లక్షల పనిముట్లును రైతులకు అందించారు. దీనిలో బ్యాంకు లోను రూ.32.87 లక్షను పీడీసీసీ బ్యాంకు చీరాల బ్రాంచ్ అందించగా రైతులకు సబ్సిడీ రూ.20.99 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. వ్యవసాయ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లును పీడీసీసీ బ్యాంకు వద్ద వ్యవసాయశాఖ అధికారుల సమక్షంలో రైతులకు అందించారు. ఈసందర్భంగా ఏవో, బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ అన్నదాతలకు అండగా పీడీసీసీ బ్యాంకు ముందుండి రుణాలను సత్వరంగా అందించిందన్నారు. రైతులను వ్యవసాయంలో రాజులాగా చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాలు అందించడం వలన రైతులకు అన్నీ విధాల మేలు చేస్తుందన్నారు. రైతులు యంత్ర పరికరాలను సద్వినియోగం చుకుని పంటల సాగులో రాణించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్, కొత్తపాలెం, ఓడరేవు గ్రామాల వీపీఏలు, బ్యాంకు సిబ్బంది, రైతులు ఉన్నారు.

చండీ యాగానికి తరలి వెళ్లిన భక్తులు

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో నిర్వహిస్తున్న రాజ శ్యామల చండీ మహాలక్ష్మి యాగానికి మార్కాపురం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల్లో తరలి వెళ్లారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, అందరూ సుభిక్షంగా ఉండాలని గత 4 రోజులుగా యాగం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సుమారు వంద మంది భక్తులు విజయవాడ వెళ్లారు. భక్తులు చండీ యాగంలో పాల్గొనడంతోపాటు దుర్గమ్మ, మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని వచ్చే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెన్నకేశవస్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ కేశవరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అప్పన్నాచార్యులు, కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి పాల్గొన్నారు. భక్తులు వెళ్తున్న బస్సును చైర్మన్ జెండా ఊపి ప్రారంభించారు.


చండీ యాగానికి వెళ్తున్న భక్తులు

వైభవంగా నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట


ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్త జనులు

త్రిపురాంతకం: పట్టాభిరామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. త్రిపురాంతకంలోని పాత ముడివేముల గ్రామంలో శ్రీసీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టలు, ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా వేదపండితులు జరిపించారు. ప్రతిష్ట కార్యక్రమాల సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ప్రతిష్టల సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు, దంపతుల పూజలు జరిగాయి. అనంతరం అన్నదానం చేశారు.

35 మంది ఉద్యోగాలకు ఎంపిక

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో మొదటి రౌండ్‌లో 35 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు బుధవారం తెలిపారు. 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రౌండ్‌లో అర్హత సాధించిన వారికి ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి తుది ఎంపికను ఖరారు చేస్తామని తెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలోగల సాయిబాబా దేవస్థానం వద్ద ఈనెల 19వ తేదీ కిమ్స్ ఆసుపత్రి ఒంగోలు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కాలేషా, తాళ్లూరి రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాధులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందని, అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

చీరాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన దాసరి వంశీ (19) తన స్నేహితుడు మహేష్‌లు ఇద్దరూ టాటా ఏఎస్ వాహనంలో గుంటూరు నుంచి వస్తుండగా ఆదివారం బాపట్ల జిల్లా అప్పికట్ల వద్ద చెట్టుకు ఢీకొంది. 108లో గుంటూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న వంశీకి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మహేష్ గుంటూరులో చికిత్స పొందుతున్నాడు.

శింగరకొండ దర్శిని

అద్దంకి రూరల్: శోభకృతు నామ సంవత్సరం ఉత్తరాయణం వైశాఖ మాసం, అశ్వని నక్షత్రం, చదుర్దశి తిథి, సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం 5 గంలనుంచి సుప్రబాత సేవ, 5.30 గంటలకు బిందేతీర్థం, మధ్యాహ్నం 1.00 గంట 1.30 గంటల వరకు పంచాహారతులతో పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ, రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసి వేస్తారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూల విరాట్టు